RNI. No. APTEL/2011/41055






# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక






సంపుటి : 12 సంచిక : 283 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం మంగళవారం, 16 ఏప్రిల్ 2024 పేజీలు : 4 వెల : 2/-

# హామీల అమలుకు కట్టుబడి ఉన్నాం



## ఆగస్టు 15 నాటికి రైతు రుణమాఫీ

### నారాయణపేట కాంగ్రెస్ జనజాతర సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

నారాయణపేట: లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో 15 ఎంపీ సీట్లలో కాంగ్రెస్‌ను గెలిపిస్తే ముదిరాజ్ బిడ్డను మంత్రిగా చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో 10శాతంగా ఉన్న ముదిరాజ్‌లకు కేసీఆర్ ఒక్క టికెట్ కూడా ఇవ్వలేదని విమర్శించారు. ఈ సామాజిక వర్గానికి చెందిన ప్రజలను బీసీ-డీ నుంచి బీసీ-ఏ గ్రూప్‌లోకి మార్చేందుకు సుప్రీంకోర్టులో పోరాడతామన్నారు. నారాయణపేటలో నిర్వహించిన 'కాంగ్రెస్ జనజాతర సభ'లో ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టులో కేసు నడుస్తున్నా.. పదేళ్లపాటు కేసీఆర్ పట్టించుకోలేదన్నారు. మరోవైపు మాదిగల వర్గీకరణ చేయాల్సిందేనని, వాళ్లకు న్యాయం జరగాల్సిందేనని సీఎం అన్నారు. భవిష్యత్తులో మాదిగలకు మరిన్ని పదవులు ఇచ్చి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. "ఎన్ని కష్టాలు ఎదురైనా కాంగ్రెస్ కార్యకర్తలు ఈ జెండాను వదల్లేదు. కాంగ్రెస్ పార్టీ పేదలకు, బీసీలకు టికెట్లు ఇచ్చి గెలిపించింది. వెనుకబడిన సామాజిక వర్గాలకు న్యాయం చేయడంలో కాంగ్రెస్‌కు మించింది లేదు. నారాయణపేట మున్సిపాలిటీకి భూగర్భ డ్రైనేజీ మంజూరు చేస్తాం. రేవంత్ రెడ్డిని ఊడగొట్టాలని భాజపా జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అంటున్నారు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కావాలని ఆమె ఎప్పుడైనా మోదీని అడిగారా? మక్తల్- వికారాబాద్ రైల్వే లైన్ కావాలని డిమాండ్ చేశారా?" అని రేవంత్ ప్రశ్నించారు. గడిచిన పదేళ్లలో కేసీఆర్ ఎంత మందికి రెండు పడక గదుల ఇళ్లు ఇచ్చారో చెప్పాలని రేవంత్ డిమాండ్ చేశారు. " కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇళ్లు మంజూరు చేశాం. ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు కేటాయించాం. బీసీలకు జనాభా దామాషా ప్రకారం నిధులివ్వాలి. వారికి న్యాయం చేసేందుకే బీసీ కులగణనకు తీర్మానం చేశాం. భారాస ప్రభుత్వం పదేళ్లపాటు ఉద్యోగ నియామకాలు చేపట్టలేదు. కేసీఆర్ పదేళ్లలోనే వందేళ్ల విధ్వంసాన్ని సృష్టించారు. పాలమూరు బిడ్డ, పేదోడి బిడ్డ సీఎం అయితే దొరలు ఓర్వలేకపోతున్నారు. దొరలు మాత్రమే కుర్చీల్లో కూర్చోవాలా? పేద బిడ్డలు కూర్చోవద్దా? కేసీఆర్.. తర్వాత ఆయన కుమారుడు మాత్రమే సీఎం కావాలా? జైలులో ఉన్న బిడ్డను కాపాడుకునేందుకు భారాస పార్టీని మోదీకి తాకట్టుపెట్టారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని మోదీ కాళ్ల వద్ద ఉంచారు. భారాస ఓట్లన్నీ భాజపాకి మళ్లించాలని కేసీఆర్ చెబుతున్నారు. వందరోజులకే నన్ను గద్దె దించాలని కేసీఆర్ అంటున్నారు. పదేళ్లుగా అధికారంలో ఉన్న మోదీని గద్దె దిం చాలని ఎందుకు అనడం లేదు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి తీరుతుందని, ఎన్ని ఇబ్బందులున్నా హామీల అమలులో వెనుకడుగు వేయబోయేది లేదని, ఆగస్టు 15 నాటికి రూ.2 లక్షల మేర రైతు రుణమాఫీ చేస్తాం" అని రేవంత్ అన్నారు.



## కాంగ్రెస్ నేతలను సమస్యలపై అడుగడుగునా రైతులు ప్రశ్నించాలి

హైదరాబాద్: కాంగ్రెస్ నేతలను రైతులు సమస్యలపై అడుగడుగునా ప్రశ్నించాలని కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం నాడు బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పార్లమెంట్ ఎన్నికల్లో ఓటేయమని అడిగితే ఏం చేశారని ప్రశ్నించాలని అన్నారు. ఎరువులు, విత్తనాలు అందకపోయినా రాష్ట్ర బీజేపీ కార్యాలయానికి తెలియజేయాలని సూచించారు.

కాంగ్రెస్ చేసిన మోసాలకు ఆత్మహత్యలు చేసుకోవద్దని ధైర్యం చెప్పారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం.. రాష్ట్రంలో తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఏ కష్టం వచ్చిన తమకు చెప్పాలన్నారు. కౌలు రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదని మండిపడ్డారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల గురించి కాంగ్రెస్ నాయకులను రైతులు నిలదీసి అడగండి కానీ.. ఆత్మహత్యలకు పాల్పడవద్దని అన్నారు.

# మన్యం.. అప్రమత్తం..!

## భద్రాచలం ఏజెన్సీలో పోలీసులు ముమ్మర తనిఖీలు

చర్ల : తెలంగాణతో సహా అయిదు రాష్ట్రాల్లో సోమవారం బంద్‌కు మావోయిస్టులు పిలుపునిచ్చిన నేపథ్యంలో మన్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. మావోయిస్టుల ఇలాకా దండకారణ్యానికి ఆనుకొని ఉన్న భద్రాచలం ఏజెన్సీపై డేగ కన్నేసిన పోలీసులు నిఘాను తీవ్రతరం చేశారు. సరిహద్దులో కొద్దిరోజులుగా మావోయిస్టులు, భద్రత బలగాలకు మధ్య జరుగుతున్న ప్రచ్ఛన్న యుద్ధంతో దండకారణ్యం ఒక్కసారిగా వేడెక్కిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రెండుపక్షాల మధ్య నిత్యం ఎదురుకాల్పుల మోతతో కీకారణ్యం దద్దరిల్లుతోంది. ఆపరేషన్ కాగర్ పేరిట విప్లవోద్యమంపై జరుగుతున్న ఫాసిస్టు మారణకాండను నిరసిస్తూ సీఆర్‌బీ (సెంట్రల్ రీజియన్ బ్యూరో) పిలుపు మేరకు మావోయిస్టు పార్టీ దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ తెలంగాణతో పాటు అయిదు రాష్ట్రాల బంద్‌కు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.



ఈ నేపథ్యంలో భద్రాచలం ఏజెన్సీలో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. సరిహద్దు ఛత్తీస్‌గఢ్ అడవుల్లో పెద్దఎత్తున కేంద్ర పారా మిలిటరీ బలగాలు కూంబింగ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నాయి.

**మావోయిస్టుల హెచ్చరికలతో వణుకు..!** సరిహద్దులో ఇటీవల జరిగిన ఎదురుకాల్పుల ఘటనలో తమ సహచరులను కోల్పోయిన మావోయిస్టులు బంద్ సందర్భంగా రెచ్చిపోయి వ్యూహాత్మక దాడులకు తెగబడే అవకాశాలు లేకపోలేదనే నిఘా వర్గాల సమాచారంతో సరిహద్దులో భద్రతను పోలీసులు కట్టుదిట్టం చేశారు. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు డోలీగుట్టల్లో జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు పార్టీ మధ్య రీజినల్ కంపెనీ-2 కమాండర్ అన్నె సంతోష్ అలియాస్ సాగర్‌తో పాటు మరో కీలక నేత ఆప్కా మణిరామ్, పీఎల్‌జీఏ సభ్యుడు పూనెం లక్ష్మణ్ మృతిచెందిన విషయం తెలిసిందే. ఈఘటనపై తెలంగాణ మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్‌తో పాటు బీకే-ఏఎస్‌ఆర్ డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ విడుదల చేసిన లేఖల్లో అధికార కాంగ్రెస్ పార్టీదే బాధ్యత అంటూ తీవ్రంగా హెచ్చరించటం కలకలం రేపుతోంది. మావోయిస్టుల బంద్ నేపథ్యంలో లక్ష్యంలో ఉన్న నేతలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాల్సిందిగా పోలీసులు మౌఖిక ఆదేశాలు జారీచేశారు. భద్రాచలం నుంచి ఏజెన్సీ ప్రాంతాలకు రాత్రిపూట బస్సు సర్వీసులను నిలిపివేశారు.

భద్రాచలం డివిజన్‌లో భారీ బందోబస్తు ఏర్పాటుచేసి ఆకస్మిక తనిఖీలు సాగిస్తున్నారు. చర్ల, దుమ్ముగూడెం సీఐలు రాజువర్మ, అశోక్ నేతృత్వంలో ఎక్కడికక్కడ నిఘా పెట్టిన పోలీసులు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ నుంచి వస్తున్న వారిపై కన్నేశారు. భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు ఆదేశాలతో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకొనేలా ఏఎస్పీ పరితోష్ పంకజ్ సరిహద్దు పోలీసుస్టేషన్ల భద్రతను పర్యవేక్షిస్తున్నారు. అదనపు ఎస్పీ(ఆపరేషన్స్) సాయిమనోహర్ సరిహద్దులో పరిస్థితులపై ఆరా తీస్తున్నారు.




# తెరపైకి కొత్త రాజకీయం

## సీఎం రేవంత్‌పై బీజేపీ, బీఆర్ఎస్ కీలక వ్యాఖ్యలు...

హైదరాబాద్ : బీజేపీ ఎంపీ అర్వింద్ వ్యాఖ్యలతో సీఎం రేవంత్‌రెడ్డిపై మరోసారి చర్చ మొదలైంది. రేవంత్ సమర్థుడే కానీ.. కాంగ్రెస్‌లో ఉంటే అసమర్థుడిగా మారిపోతారని సెటైర్లు వేశారు. భవిష్యత్తు గురించి ఆలోచించుకోవాలని హితవు పలికారు. తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహారం ఆసక్తికరంగా మారింది. లోక్ సభ ఎన్నికల వేళ బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ ఈ మూడు పార్టీలు ప్రచాంలో జోష్ పెంచాయి. జాతీయపార్టీలు మ్యానిఫెస్టోను కూడా విడుదల చేశాయి. పైగా మరో మూడు రోజుల్లో నామినేషన్ ప్రక్రియ కూడా ప్రారంభం కానుంది. ఈనేపథ్యంలో బీజేపీ, బీఆర్ఎస్ రేవంత్ రెడ్డిని ఉద్దేశిస్తూ చేసిన వ్యాఖ్లలు తీవ్ర దుమారంగా మారాయి. ఎన్నికల తర్వాత రేవంత్‌రెడ్డి బీజేపీలో చేరుతారని, మరో ఏక్‌నాథ్ షిండే అవుతారని ఈ మధ్య బీఆర్ఎస్ నేతలు వరుసగా కామెంట్ చేస్తున్నారు. ఈ క్రమంలో బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ఆరోపిస్తున్న వాటికి బలం చేకూరుస్తూ రేవంత్‌రెడ్డిని బీజేపీలోకి ఆహ్వానించారు. అంతేకాదు..రేవంత్‌కు 15 ఏళ్ల రాజకీయ జీవితం ఉందన్న ఆయన.. కాంగ్రెస్‌కు భవిష్యత్ లేదని విమర్శించారు. సీఎం రేవంత్ సమర్థుడేకానీ.. కాంగ్రెస్ పార్టీలో ఉంటే అసమర్థుడిగా మారిపోతారన్నారు. రేవంత్‌రెడ్డి పక్కా హిందూ అయితే జ్ఞానవాపీ, మథురపై తన నిర్ణయమేమిటో చెప్పాలన్నారు ధర్మపురి అర్వింద్. రేవంత్ హాజరైన ఆప్ కీ అదాలత్ షో పెద్ద కామెడీ షోగా మారిందంటూ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌కు దేశవ్యాప్తంగా 30 ఎంపీ సీట్లు కూడా రావు అని జోష్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. ఇదిలా ఉంటే దీనిపై కాంగ్రెస్ సీనియర్ నేత తెలంగాణ మంత్రి కోమటి రెడ్డి వెంకట రెడ్డి స్పందించారు. కాంగ్రెస్‌లో ఏకనాథ్ షిండేలు లేరని.. ఏకనాథ్ షిండేను సృష్టించిందే బీజేపీ పార్టీ అని మండిపడ్డారు. కాంగ్రెస్ 10 ఏళ్ళు అధికారంలో ఉంటుంది, సీఎంగా రేవంత్ రెడ్డే ఉంటారన్నారు మంత్రి కోమటిరెడ్డి. మొత్తానికి మరోసారి ఎంపీ అర్వింద్ వ్యాఖ్యలతో రేవంత్‌రెడ్డిపై చర్చ మొదలైంది.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## ఏపీ రాజకీయాల్లో కానరాని కామ్రేడ్లు!

కమ్యూనిస్టు పార్టీలు అంటే గతంలో ప్రజలకు ఓ క్రేజ్. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్నికలు వచ్చాయంటే కామ్రేడ్లతో పొత్తుకు తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీలు తహతహలాడేవి. కామ్రేడ్లతో జతకట్టిన వారే అధికారంలోకి రావడం ఖాయంగా ఉండేది. కాలక్రమంలో కమ్యూనిస్టు నేతలు మిగతా బూర్జువా పార్టీల మాదిరిగా మారిపోయి ప్రజాస్వామ్యంగా కాకుండా వ్యక్తిస్వామ్య పోకడల మూలంగా కమ్యూనిస్టు పార్టీల ప్రభ మెల్లగా మసకబారడం మొదలయింది. 1999 ఎన్నికలలో కొత్తగా చంద్రబాబు నాయుడు బీజేపీతో జతకట్టడంతో ఉమ్మడి రాష్ట్రంలో కొత్త పొత్తులకు తెరలేచింది. 2004 ఎన్నికలలో వైఎస్ కమ్యూనిస్టులతో జతకట్టి అధికారంలోకి వచ్చాడు. 2009 ఎన్నికల వరకు కమ్యూనిస్టు నేతలను కాంగ్రెస్ పార్టీలోకి లాక్కుని వైఎస్ కమ్యూనిస్టుల బలాన్ని దెబ్బతీశాడు. దీంతో ఉమ్మడి రాష్ట్రంలోనే కమ్యూనిస్టు పార్టీలు నామమాత్రంగా మారాయి. తాజాగా తెలంగాణలో జరిగిన ఎన్నికల్లో సీపీఐ పార్టీ నుండి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం ఎమ్మెల్యేగా కూనంనేని సాంబశివరావు గెలిచినా అది కాంగ్రెస్ పొత్తు, వ్యక్తిగత ప్రభావం, బీఆర్ఎస్ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వర్ రావు మీద ఉన్న వ్యతిరేకత కారణంగానే గెలిచారు తప్పితే సీపీఐ బలం మీద కాదు. ఇక సీపీఎం పార్టీ పోటీ చేసినా ఎక్కడా తన సత్తా చాటలేకపోయింది. అయితే ఆంధ్రప్రదేశ్ లో జరుగతున్న శాసనసభ, లోక్ సభ ఎన్నికలలో కామ్రేడ్ల జాడ కానరావడం లేదు. సరిగ్గా పోలింగ్ కు కేవలం 30 రోజులు మాత్రమే సమయం ఉంది. అయినా కమ్యూనిస్టు పార్టీలు ఎన్నికలలో పోటీ గురించి ఏ విషయం కూడా వెల్లడించడం లేదు. సీపీఎంతో పొల్చుకుంటే సీపీఎం ఈ విషయంలో ఒక అడుగు ముందుంది. అయితే సుధీర్ఘ అనుభవం కలిగిన కమ్యూనిస్టు నేతలు ఆంధ్రాలో కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకోవాలని ఆలోచించడం, దానికి షర్మిల అనుమతి అవసరం పడడం నిజంగా కమ్యూనిస్టులకు అగౌరవమే. ఎన్నికలు దగ్గర పడడంతో తప్పనిసరి పరిస్థితులలో పోటీకి సిద్ధపడి సీపీఎం పార్టీ ఎనిమిది శాసనసభ స్తానాలతో పాటు అరకు పార్లమెంట్ స్థానం నుండి పోటీ చేయడానికి నిర్ణయించారు. ఇక సీపీఐ పార్టీకి కేటాయించిన స్థానాల లెక్క ఇంతవరకు తేలలేదు. ఆ పార్టీకి కూడా అంతే స్థాయిలో సీట్లు కేటాయించే అవకాశం కనబడుతున్నది. ఒకప్పుడు శాసించే స్థాయి నుండి కమ్యూనిస్టులు ప్రస్తుతం యాచించే స్థానానికి వచ్చారు. తెలంగాణ ఆంధ్ర రాష్ట్రాల విభజనతో కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ నుండి పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. ఈ సారి ఎన్నికలలో కూడా అది ఒక, అరా స్థానాలు గెలిచేది అనుమానమే. కనీసం ఆ పార్టీకి డిపాజిట్లు దక్కినా ఆశ్చర్యమే. అలాంటి పార్టీతో కమ్యూనిస్టులు పొత్తు పెట్టుకుని ఎన్నికలకు వెళ్లాలనుకోవడం కుక్కతోక పట్టుకుని గోదావరిని ఈదడమే అని చెప్పాలి. ఇప్పటికే అంతంతమాత్రంగా ఉన్న సీపీఎం, సీపీఐ పార్టీలు భవిష్యత్తులో మనుగడ సాగించడం అనుమానమే అని చెప్పాలి.

# కాంగ్రెస్ లో చేరిన మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు

### ఖండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించిన సీఎం రేవంత్ రెడ్డి

### నిర్మల్ మున్సిపల్ ఛైర్మెన్ కూడ కాంగ్రెస్ లోకి జంప్









**ఆదిలాబాద్ ఏప్రిల్ 15(ప్రభాత సమాచారం)**
ఎన్నికల వేల కాంగ్రెస్ లోకి వలసలు జోరందుకొన్నాయి. బీజేపీ, బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ లో చెరెందుకు క్యూ కడుతున్నారు. సోమవారం బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, నిర్మల్ మున్సిపల్ ఛైర్మెన్ ఈశ్వర్ హైదరాబాద్ లో సీఎం రేవంత్ రెడ్డి సమక్షం లో కాంగ్రెస్ పార్టీలో చేరారు.రాథోడ్ బాపూరావు బోథ్ నియోజకవర్గం నుంచి రెండు సార్లు ఎమ్మెల్యే గా ఎన్నికయ్యారు. గత ఎన్నికల్లో బిఆర్ఎస్ టికెట్ నిరకరించడంతో ఆయన బిఆర్ఎస్ కు రాజీనామా చేసి బీజేపీ లో చేరారు. అక్కడ కూడ ఆయన ఇముడలేక బీజేపీ కి రాజీనామా చేసారు. సీఎం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.నిర్మల్ లో మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అనుచరుడు నిర్మల్ మున్సిపల్ ఛైర్మెన్ గంద్రత్ ఈశ్వర్ బిఆర్ఎస్ కు షాక్ ఇచ్చి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచుకొన్నారు.

# యోధుల అడ్డా.. కరీంనగర్



కరీంనగర్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు.. తెలంగాణ రాష్ట్రంలోనూ కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గం ప్రత్యేకత చాటుకుంటోంది. ఒక ఉప ఎన్నిక మినహాయిస్తే 1952 నుంచి ఇప్పటివరకు జరిగిన 17 సాధారణ ఎన్నికల్లో వివిధ పార్టీల నుంచి ఎన్నికైన నేతలు రాష్ట్ర రాజకీయాల్లో తమదైన ముద్ర వేసుకోవడం విశేషం. కేంద్ర మంత్రులుగా, రాష్ట్ర స్థాయి పదవుల్లో ఘనత చాటుకున్నారు. ఇక్కడి నుంచి కాంగ్రెస్, భాజపా, భారాస అభ్యర్థులు ఎక్కువ సార్లు విజయం సాధించారు.

గులాబీ దళపతి

మలి దశ తెలంగాణ ఉద్యమ సమయంలో భారాస అధినేత కె.చంద్రశేఖర్‌రావు 2004 సాధారణ ఎన్నికల్లో కరీంనగర్ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో కొంతకాలం కేంద్ర మంత్రిగానూ పని చేశారు. నాటి కాంగ్రెస్ నేత, రాష్ట్ర మంత్రి ఎమ్మెస్సార్ చేసిన సవాల్ స్వీకరించి ఎంపీ పదవికి రాజీనామా చేసి ఉప ఎన్నికల్లో తిరిగి విజయం సాధించారు. రాష్ట్రం ఆవిర్భవించాక శాసనసభ ఎన్నికల్లో విజయబావుటా ఎగురవేసి తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం శాసనసభలో ప్రతిపక్ష నేతగా ఉన్నారు.చొక్కారావు హ్యాట్రిక్ విజయం

1952 నుంచి ఇప్పటివరకు వరుసగా మూడు సార్లు విజయం సాధించిన ఘనత కాంగ్రెస్ నేత జువ్వాడి చొక్కారావుకే దక్కింది. 1984, 1989, 1991 ఎన్నికల్లో ఆయన గెలిచారు. అంతకుముందు స్వాతంత్ర్య పోరాటంలో తనవంతు పాత్ర పోషించారు. మాజీ ప్రధాని పి.వి.నరసింహారావుతో కలిసి పని చేశారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా, జడ్పీ ఛైర్మన్‌గా సేవలందించిన చొక్కారావు నిరాడంబర జీవితానికి నిలువుటద్దంగా గుర్తింపు పొందారు. 1962, 67 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి జె.రమాపతిరావు రెండు సార్లు, 1952, 57లలో కాంగ్రెస్‌తో పాటు పార్టీ అనుబంధ విభాగం నుంచి ఎం.ఆర్.కృష్ణ రెండు సార్లు విజయం అందుకున్నారు.

రాష్ట్ర స్థాయిలో కీలకం ప్రస్తుత ఎంపీ, రెండోసారి బరిలో దిగిన భాజపా అభ్యర్థి బండి సంజయ్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. గతంలో రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరించారు.

2009లో కాంగ్రెస్ నుంచి గెలిచిన ప్రస్తుత రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఉమ్మడి రాష్ట్ర ఎంపీల ఫోరం కన్వీనర్‌గా పని చేశారు.

1996 ఎన్నికల్లో తెదేపా అభ్యర్థిగా గెలిచిన ప్రస్తుత భారాస ఎమ్మెల్సీ ఎల్.రమణ తెదేపా తెలంగాణ అధ్యక్షుడిగా వ్యవహరించారు. ృ 2014లో భారాస నుంచి గెలిచిన వినోద్‌కుమార్ పార్టీ లోక్‌సభా పక్ష ఉపనేతగా వ్యవహరించారు. అనంతరం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగానూ పని చేశారు.

ఉద్యమ నేత బద్దం బోణీ

స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాటానికి నేతృత్వం వహించిన కమ్యూనిస్టు నేత బద్దం ఎల్లారెడ్డి కరీంనగర్ మొదటి ఎంపీగా ఎన్నికయ్యారు. 1952లో జరిగిన తొలి ఎన్నికల్లో పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్ తరఫున బరిలోకి దిగి ఘన విజయం సాధించారు. కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఉండటంతో పీడీఎఫ్ నుంచి పోటీ చేశారు. 1953లో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం సడలించాక రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. నిజాం నిరంకుశ పాలనకు, భూస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా పోరాడిన ఎల్లారెడ్డి సేవలు గుర్తు చేసుకుంటూ కరీంనగర్ కూరగాయల మార్కెట్ చౌరస్తాలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

టీపీఎస్ నుంచి ఎమ్మెస్సార్

ఎం.సత్యనారాయణరావు 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి మూడు సార్లు జైలుకు వెళ్లారు. ఆ సమయంలో పురుడు పోసుకున్న తెలంగాణ ప్రజా సమితి(టీపీఎస్) ద్వారా ప్రజల మధ్యకు వచ్చారు. 1971 లోక్‌సభ ఎన్నికల్లో కరీంనగర్ నుంచి టీపీఎస్ తరఫున పోటీ చేసి గెలిచారు.మొదటిసారి లోక్‌సభలో అడుగు పెట్టడంతోనే డిప్యూటీ లీడర్‌గా పని చేశారు. అనంతరం కాంగ్రెస్‌లో టీపీఎస్ విలీనం కాగా ఎమ్మెస్సార్ పార్టీలో చురుకైన పాత్ర పోషించారు. 1977–1980 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున గెలిచి నాటి ప్రధాని ఇందిరకు అత్యంత నమ్మకస్థుడిగా మెలిగారు. 1980 నుంచి 1983 వరకు ఏఐసీసీ ప్రధానకార్యదర్శిగా పని చేసి ఆరు రాష్ట్రాలకు పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా పని చేశారు. పలు పార్లమెంటరీ కమిటీల్లో సభ్యుడిగా ఉండటంతో పాటు అభివృద్ధి పనులతో గుర్తింపు పొందారు. అనంతరం శాసనసభ్యుడిగా, రాష్ట్ర మంత్రిగా, ఆర్టీసీ ఛైర్మన్‌గా, పీసీసీ అధ్యక్షుడిగా కొనసాగారు. కేంద్ర సహాయ మంత్రిగా సాగర్‌భారతీయ జనతా పార్టీ సైనికుడిగా ఎదిగిన సీహెచ్ విద్యాసాగర్‌రావు 1998–1999 ఎన్నికల్లో కరీంనగర్ నుంచి ఎంపీగా గెలుపొందారు. వాజ్‌పేయీ నేతృత్వంలోని భాజపా ప్రభుత్వంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా వ్యవహరించారు. ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తూనే జాతీయ స్థాయిలో కరీంనగర్ వాణి వినిపించారు. అనంతరం మహారాష్ట్ర గవర్నర్‌గా పని చేశారు. మెట్‌పల్లి శాసనసభ్యుడిగా, భాజపా శాసనసభా పక్ష నాయకుడిగా, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగానూ వ్యవహరించారు.

# రొయ్య ఎటుపోయిందో?

బోయినపల్లి : మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు కల్పించేం దుకు జలాశయంలో రొయ్య పిల్లలను ఏటా వదులుతున్నారు. అయితే ఇవి మత్స్యకారుల వలకు చిక్కడం లేదు. జలాశయంలో వదిలినవి ఏమవు తున్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. కోట్లలో పిల్లలను వదులుతున్నట్లు అధికారులు చెబుతున్నా వందల్లో కూడా దొరకని పరిస్థితి ఏర్పడింది. సరైన నైపుణ్యం లేకపోవడంతో మత్స్యకారులు వాటిని పట్టడం లేదని చెబుతుండటం గమనార్హం. ప్రస్తుతం జలాశయంలో నీరు బాగా తగ్గినప్పటికీ అవి దొరకని పరిస్థితి ఉంది.

బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద 27.5 టీఎంసీల సామర్థ్యంతో రాజరాజేశ్వర (మధ్యమానేరు) జలాశయం నిర్మించారు. ఇందులో ముంపునకు గురైన కొదురుపాక, నీలోజిపల్లి, వరదవెల్లి, శాభాష్‌పల్లి, సంకెపల్లి, రుద్రవరం, అనుపురం, కొడుముంజ, చీర్లవంచ, చింతల్‌ఠాణా, గుర్రంవాణిపల్లి గ్రామాల నిర్వాసితులతోపాటు సమీప గ్రామాల్లోని మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. ఈ మేరకు జలాశయంలో నీటి నిల్వ అనంతరం 2018–19 నుంచి చేప, రొయ్య పిల్లలను వదులుతున్నారు. ఇప్పటి వరకు సుమారు 1.3 కోట్ల రొయ్య పిల్లలను వదిలారు. నెల రోజుల వయసున్న 0.3 గ్రామాల బరువు ఉన్న పిల్లలను విడిచిపెట్టగా, సుమారు నాలుగు నుంచి అయిదు నెలల వ్యవధిలో 300 గ్రాముల బరువు వరకు పెరుగుతుంది. ఫిబ్రవరి నుంచి మే నెల వరకు జలాశయంలో ఇవి అధికంగా లభిస్తాయి. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.400 వరకు ధర పలుకుతోంది. అయితే మత్స్యకారులకు వ్యాపారులు మాత్రం రూ.200 చెల్లిస్తున్నారు.నైపుణ్యం లేక...జలాశయం పరిధిలో అనేక మంది మత్స్యకారులు ప్రధానంగా చేపలు పడుతూ ఉపాధి పొందుతున్నారు. వీరిలో కొంత మంది మాత్రమే చేపలు, రొయ్యలు పడుతుంటారు.

వాటిని పట్టడంలో సరైన నైపుణం అవసరం. వాటికి సంబంధించి ప్రత్యేకమైన బుట్టలు అమర్చాల్సి ఉంటుంది. అయితే చేపల కోసం వేసిన వలలకు అప్పుడప్పుడు అరకొరగా పడుతున్నట్లు చెబుతున్నారు. రొయ్యలు పట్టకపోవడంతో అవి పెద్దవి అయి అంతరించిపోతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

## మాజీ మంత్రి కొట్నాక్ భీంరావ్ తనయుడి మృతి



**ఉట్నూర్ ఏప్రిల్ 15(ప్రభాత సమాచారం)**
మాజీ మంత్రి కొట్నాక్ భీంరావ్ తనయుడు,ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి సోదరుడు కొట్నాక్ సుధాకర్ (50)అనారోగ్యంతో సోమవారం ఉట్నూర్ లో మృతి చెందారు.అయన అంత్యక్రియలు కొమరం భీమ్ అసిఫాబాద్ జిల్లా బంబారా కోసరా గ్రామంలో జరిగాయి.

# నీటి నిర్వహణలో అమృత్ మిత్ర

గోదావరిఖని : నగరాలు, పట్టణాల్లో నీటి నిర్వహణ తీరును మెరుగు పరచడంతో పాటు వినియోగంపై ప్రజల్లో అవగాహన కలిగించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అమృత్ మిత్రల నియామకానికి శ్రీకారం చుట్టారు. తాజాగా 'అమృత్–02' నిధులతో నీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరచనున్న నగరాలు, పట్టణాల్లో మొదటగా అమృత్ మిత్రలను ఏర్పాటు చేయనున్నారు. నీటి నిర్వహణ, సరఫరాలో మెరుగైన చర్యలు తీసుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు వీలుగా ప్రభుత్వం అదనంగా నిధులు కేటాయించింది. తాగునీరు, ఉద్యానవనాలు, మురుగు జలాల శుద్ధి నిర్వహణను మెరుగు పరిచేందుకు రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చు చేసేలా నిబంధనలను విధించారు. ఈ పనులు స్వశక్తి మహిళల ద్వారానే చేపట్టాల్సి ఉంటుంది. దేశవ్యాప్తంగా ఇలాంటి 1500 ప్రాజెక్టులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చే అవకాశముంది. 'అమృత్ మిత్ర' ప్రాజెక్టుల్లో మూడు శాతం నిధులను ప్రత్యేక శిక్షణల ద్వారా ఆయా ప్రాంతాల్లోని మహిళల సామర్థ్యాల పెంపుదల కోసం వినియోగించనున్నారు. ఎవరు ముందు దరఖాస్తు చేసుకుంటే వారికే మొదటగా అవకాశం ఇవ్వనున్నారు. మొదటి దశలో కరీంనగర్, రామగుండం నగరపాలికల్లో మిత్ర'ల నియామకానికి చర్యలు తీసుకుంటున్నారు.




**అర్హతలు** అమృత్ మిత్రల ఎంపిక కోసం సంబంధిత స్వశక్తి సంఘం తప్పనిసరిగా నేషనల్ అర్బన్ లైవ్‌లీహుడ్ మిషన్(ఎన్.యు.ఎల్.ఎం.)లో నమోదు చేసుకొని ఉండాలి. ఆయా నిబంధనల అమలు, క్రమం తప్పకుండా సమావేశాలు, పొదుపు, అంతర్గత రుణసాయం, రుణాల చెల్లింపు, దస్త్రాల నిర్వహణ తదితర పంచసూత్రాలను పాటిస్తుండాలి. సంబంధిత స్వశక్తి సంఘంలో కనీసం ఒకరు 8వ తరగతికి పైగా చదువుకొని ఉండాలి. సంఘం పేరుతో బ్యాంకు ఖాతా ఉండాలి. సంఘం సభ్యులపై ఎలాంటి క్రిమినల్ కేసులు ఉండరాదు. గతంలో నీటి నిర్వహణలో పాల్గొన్న స్వశక్తి సంఘాలకు ప్రాధాన్యం ఉంటుంది. అత్యంత ఉత్సాహంగా పనిచేసి తాగునీరు, మురుగు జలాల శుద్ధి, ఉద్యానవనాల నిర్వహణలో అత్యంత ప్రతిభ కనబరిచిన 'అమృత్ మిత్ర'లకు ప్రత్యేక అవార్డులను ప్రదానం చేయనున్నారు.

విధి విధానాలు ఇవీ.. ఎంపిక చేసిన స్వశక్తి సంఘాలను 'అమృత్ మిత్ర'గా నియమిస్తారు. నీటి నిర్వహణే ప్రధాన అంశంగా ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఇంటింటికీ మెరుగైన తాగునీరు అందించేలా పర్యవేక్షించడంతో పాటు ఆయా నివాసాల్లోని మహిళలకు నీటి వినియోగంపై అవగాహన కల్పిస్తారు. నీటి నిర్వహణలో ఆరోగ్యకర జీవన విధానాన్ని పెంపొందించేలా చర్యలు తీసుకుంటారు. నీటి వినియోగం మీటర్ల ఏర్పాటు, లీకేజీల నివారణలోనూ 'అమృత్ మిత్ర' కీలకపాత్ర పోషించనున్నారు. నీటి నిర్వహణ, సరఫరాలో 'అమృత్ మిత్ర'లు పూర్తి బాధ్యతలను తీసుకుంటూ ప్రజలకు, పట్టణ, స్థానిక సంస్థలకు అనుసంధానంగా వ్యవహరిస్తారు. నీటి దుబారా వల్ల ఎదురయ్యే కష్టాలను ప్రజలకు వివరిస్తారు. నీటి నిర్వహణలో ఎలాంటి అక్రమాలకు చోటు లేకుండా పారదర్శకంగా పర్యవేక్షిస్తారు. ఉద్యానవనాలు, మురుగు జలాల శుద్ధి కేంద్రాలు, మానవ వ్యర్థాల శుద్ధి కేంద్రాల నిర్వహణ తీరును 'అమృత్ మిత్ర'లు పర్యవేక్షించనున్నారు. ఆయా విభాగాల నిర్వహణను మెరుగు పరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించి దానికి అనుగుణంగా సాంకేతికపరమైన చర్యలు తీసుకునేందుకు ప్రణాళిక రూపొందించనున్నారు.ఎంపిక ప్రక్రియ పూర్తయింది సుచరణ్, ఈఈ, రామగుండం కార్పొరేషన్‌నగరంలో అర్హతలు కలిగిన, నిర్వహణలో ఉత్సాహంగా ఉన్న స్వశక్తి సంఘాలను 'అమృత్ మిత్ర'లుగా ఎంపిక చేశాం. తాగునీటి సరఫరా, మురుగు జలాల శుద్ధి, ఉద్యానవనాలు, నర్సరీల నిర్వహణను వీరు పర్యవేక్షించనున్నారు. వారికి అధికారిక ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంది. ఎన్నికల కోడ్ ముగియగానే ఆయా అంశాలను అమలు చేస్తాం.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
మంగళవారం 16 ఏప్రిల్ 2024

# పట్టు నిలపాలని.. పాగా వేయాలని..

వికారాబాద్ : పార్లమెంటు ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కాంగ్రెస్, భారాస, భాజపాలు సమరానికి సన్నద్ధమవుతున్నాయి. 2008లో నూతనంగా ఏర్పడిన చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలో రెండుసార్లు వరుస విజయాలు సాధించిన భారాస మరో విజయంతో హ్యాట్రిక్ సాధించాలని ఉవ్విళ్లూరుతోంది. కాంగ్రెస్ రెండో గెలుపు నమోదు చేసి పట్టు సాధించాలని తహతహలాడుతోంది. ప్రధాని మోదీ చరిష్మాను నమ్ముకున్న భాజపా ప్రత్యేక వ్యూహంతో ఎన్నికల సమరంలో ముందుకెళ్తోంది.

**తొలి గెలుపు సాధనకు భాజపా కసరత్తు**

తొలి విజయం కోసం కమలదళం కసరత్తు చేస్తోంది. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆ పార్టీని వీడి భాజపాలో చేరి తమ పార్టీ శ్రేణులను సన్నద్ధం చేస్తున్నారు. తొలి విజయం కోసం శ్రమిస్తున్నారు.

**హ్యాట్రిక్ కోసం భారాస..**

చేవెళ్లలో వరుసగా మూడో విజయం సాధించి హ్యాట్రిక్ సాధించాలని భారాస ప్రణాళికలు రచిస్తోంది. 2014లో భారాస అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, 2019లో గడ్డం రంజిత్‌రెడ్డిలు విజయం సాధించారు. శాసనసభ ఎన్నికల అనంతరం మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో సిట్టింగ్ ఎంపీ కాంగ్రెస్‌లో చేరి ఆ పార్టీ తరఫున పోటీ



చేస్తుండగా, తెదేపా రాష్ట్ర అధ్యక్ష పదవికి రాజీనామా సమర్పించి భారాసలో చేరిన కాసాని జ్ఞానేశ్వర్‌ను బరిలో దించింది. గత శాసనసభ ఎన్నికల్లో భారాసకు ఏడు నియోజకవర్గాల్లో కలిపి కాంగ్రెస్ కంటే 65,600 ఓట్లు అధికంగా వచ్చాయి. ఈసారికూడా గెలుస్తామని ఆశిస్తున్నారు.

**కార్యకర్తలను సమాయత్తం చేస్తూ..**

భారాస నుంచి సిట్టింగ్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి పార్టీ మారి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలువగా, భారాస కాసాని జ్ఞానేశ్వర్‌ను, భాజపా కొండా విశ్వేశ్వర్‌రెడ్డిలను తమ అభ్యర్థులుగా ప్రకటించాయి. లోక్‌సభ నియోజకవర్గానికి కాంగ్రెస్ ఇంఛార్జిగా వేంనరేందర్‌రెడ్డి, భారాస ఇంఛార్జిగా మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డిని నియమించగా, భాజపా ఇంకా నియమించలేదు. ప్రస్తుతం మూడు పార్టీలు నియోజకవర్గ, మండల స్థాయిల్లో కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తూ ఎన్నికలకు సమాయత్తం చేస్తున్నాయి.

**రెండో గెలుపుపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి**

చేవెళ్లలో రెండో విజయంపై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. 2009లో గెలిచిన ఆ పార్టీ 2014, 2019లో జరిగిన ఎన్నికల్లో ఓడిపోయింది. ప్రస్తుతం చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో జిల్లాలోని వికారాబాద్, తాండూర్, పరిగి శాసనసభ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. మిగతా నాలుగు నియోజకవర్గాల్లో భారాస ఎమ్మెల్యేలు ఉన్నారు. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండటం, ఇతర పార్టీల నుంచి నాయకులు చేరడంతో కొంత బలం పుంజుకుంది.

# హైదర్‌నగర్ భూముల పరిరక్షణకు సిద్ధం

హైదరాబాద్ :మియాపూర్ సమీపంలోని హైదర్‌నగర్‌లో ప్రభుత్వ అధీనంలోకి వచ్చిన భూములను పరిరక్షించేందుకు రెవెన్యూ అధికారులు సిద్ధమయ్యారు. సర్వే నంబర్ 172లోని 196 ఎకరాల్లో 185 ఎకరాలను ప్రభుత్వపరం చేసుకునేందుకు రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారులు న్యాయనిపుణులతో చర్చించారు. అంతకుముందు హైదర్‌నగర్ భూములు తమవేనంటూ దుర్గామాత హౌస్ బిల్డింగ్ కో-ఆపరేటివ్ సొసైటీ, ట్రినిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్, ఇతర కంపెనీలు సుప్రీంకోర్టులో మూడేళ్ల క్రితం వేర్వేరుగా స్పెషల్ లీవ్ పిటీషన్లు దాఖలు చేశారు. ఈ భూములు ప్రభుత్వానివేనంటూ రెవెన్యూ అధికారులు పిటిషన్ వేశారు. వాటిలో కేవలం 11 ఎకరాల భూమి 1948 సంవత్సరానికి ముందు జాగీర్దారుల వద్ద కొన్న పట్టాదారులకు



చెందుతుందని సుప్రీంకోర్టు ప్రకటించింది. ఈ తీర్పుపై అప్పీలు చేయడానికి వీల్లేకుండా ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు హైదర్‌నగర్ భూముల అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపట్టనున్నామని కూకట్‌పల్లి తహసీల్దార్ స్వామి తెలిపారు.

**విలువ రూ.7 వేల కోట్లు**

ఆరు దశాబ్దాలకు పైగా వివాదాల్లో నలిగిన ఆ భూముల విలువ ప్రస్తుతం రూ.7 వేల కోట్లు ఉంటుంది. జాతీయ రహదారికి అనుకుని ఉండడం, స్థిరాస్తి వెంచర్లు, ఐటీ సంస్థలు సమీపంలో ఉండడంతో వీటి విలువ 15ఏళ్లలో కొన్నిరెట్లు పెరిగింది. వీటిని సొంతం చేసుకునేందుకు కొందరు ప్రైవేటు వ్యక్తులు, రాజకీయ నాయకులు ప్రయత్నాలు చేశారు. పైగా వారసులతోపాటు నిజాం వారసులు, జాగిర్దార్‌ల నుంచి కొన్నామంటూ వాదించారు. 1956లో నాంపల్లి కోర్టులో సివిల్ సూట్ వేశారు. భూముల విస్తీర్ణం ఎక్కువగా ఉండడంతో నాంపల్లి కోర్టు సివిల్ సూట్‌ను హైకోర్టుకు బదిలీ చేసింది. హైకోర్టు ఈ వ్యాజ్యాన్ని విచారించి పైగా వంశస్తులకు అనుకూలంగా ప్రిలిమినరీ డిక్రీని 1963లో జారీ చేసింది. తుది తీర్పు రాకుండానే.. పైగా వంశస్తుల నుంచి కొన్ని సంస్థలు, హౌసింగ్ సొసైటీలు కొనుగోలు చేశాయి. ఈ ఉత్తర్వులపై ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయగా అప్పటి నుంచి వ్యాజ్యాలు కొనసాగుతున్నాయి. ఈ భూములు ప్రైవేటు సంస్థలు, పైగా వారసులకు చెందినవి కావని, ప్రభుత్వానివీ కావంటూ హైకోర్టు నాలుగేళ్ల క్రితం ఉత్వర్వులు జారీచేసింది.

# తాగునీటి తప్పిదాలపై జలమండలి కన్నెర్ర



హైదరాబాద్: రాజధానిలో తాగునీటి సరఫరాలో అక్రమాలకు పాల్పడుతున్న లైన్‌మెన్లపై జలమండలి కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. నగరవాసులకు సరిపడా నీటిని సరఫరా చేస్తున్నా, కొందరు జలమండలి లైన్‌మెన్లు తమకు ఆమ్యామ్యా ఇచ్చే కాలనీలకు అధికంగా, మిగిలిన కాలనీలకు తక్కువ సమయం సరఫరా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. చందానగర్‌తో పాటు మరికొన్ని ప్రాంతాల్లో ఇలా అక్రమాలు జరుగుతున్నాయని విజిలెన్సు విచారణలో తేలడంతో ఇప్పటికే ఇద్దరు లైన్‌మెన్లను సస్పెండ్ చేసింది. జలమండలి ప్రతి రోజూ 500ఎంజీడీల నీటిని నగరవాసులకు సరఫరా చేస్తోంది. సక్రమంగా అందిస్తే అన్ని ప్రాంతాలకు తాగునీటిని ఇబ్బంది లేకుండా పంపిణీ చేయొచ్చు. వేసవిలో తాగునీటి వినియోగం ఒక్కసారిగా పెరిగింది. చాలా ప్రాంతాల్లో గరిష్ఠ వేగంతో సరఫరా కావడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయి. ఇదే సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఉన్నతాధికారులతో నగరంలో పరిస్థితిపై సమీక్ష చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎక్కడా తాగునీరు అందడం లేదన్న ఫిర్యాదులు రాకూడదని స్పష్టంచేశారు. పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్ రెండుమూడుసార్లు జలమండలి కార్యాలయానికి వెళ్లి అధికారులతో పూర్తిస్థాయిలో సమీక్ష చేశారు. బుక్ చేసుకున్న నాలుగైదు రోజులకుగానీ ట్యాంకర్లు రావడం లేదన్న ఫిర్యాదులపై ఆయన స్పందించారు. ట్యాంకర్ల సంఖ్య పెంచి రాత్రిళ్లు కూడా సరఫరా చేపట్టాలని ఆదేశించారు. దీంతో చాలా ప్రాంతాల్లో ట్యాంకర్లతో సరఫరా చాలా వరకు మెరుగుపడింది. ఇదే సమయంలో, తమ ప్రాంతంలో రోజు విడిచి రోజు ఇచ్చే తాగునీటిని సక్రమంగా సరఫరా చేయడం లేదన్న ఫిర్యాదులు చాలా ప్రాంతాలనుంచి అందాయి. దానకిషోర్ ఆదేశాలతో జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి.. మొత్తం వ్యవవరంపై విజిలెన్సు విచారణకు ఆదేశించారు. విచారణ చేసిన అధికారులు ఆ ఫిర్యాదుల్లో నిజం ఉన్నట్లు తేల్చారు. చందానగర్‌లో ఒక లైన్‌మెన్ ఒక ఏరియాలో రెండు గంటల పాటు, మరో ఏరియాలో 20 నిమిషాలపాటే నీటిని సరఫరా చేస్తున్నారు. రెండు గంటల సరఫరాకు సంబంధిత కాలనీల్లోని కొంతమంది వద్ద భారీగా వసూళ్లు చేస్తున్నట్లు తేలింది. ఇదే పరిధిలో మరో లైన్‌మెన్ కూడా అక్రమాలకు తెరతీశారని విచారణలో వెలుగుచూసింది. ఈ ఇద్దరు లైన్‌మెన్లను రెండురోజుల కిందటే సస్పెండ్ చేశారు. మరో 20మంది తీరుపై విచారణ చేస్తున్నారు. మహా నగరంలో దాదాపు 700 మంది లైన్‌మెన్లు ఉన్నారు. ఎండాకాలం వచ్చిందంటే ఇందులో కొంతమంది లైన్‌మెన్లు రూ.లక్షల్లో వసూలుచేస్తున్నారన్న ఫిర్యాదులున్నాయి. గేటెడ్ కమ్యూనిటీలకు అధికంగా నీటిని సరఫరా చేస్తున్నారు. అందుకు నెలకు రూ.లక్షల్లోనే వసూలు చేస్తున్నారని తెలిసింది. మరికొన్ని చోట్ల డబ్బులిచ్చే కాలనీలవారికి అధికంగా సరఫరా చేస్తున్నారు. మిగిలిన కాలనీలకు పావుగంటో, అరగంటో మాత్రమే సరఫరా చేస్తున్నారు. ఆయా చోట్ల ఎవరికీ నీళ్లు సరిపోవడం లేదు. మెహిదీపట్నం, అత్తాపూర్, దిల్‌సుఖ్‌నగర్, సికింద్రాబాద్, మాదాపూర్, ఇంకా చాలా ప్రాంతాల్లో ఇలానే జరుగుతోందని చెబుతున్నారు. అందుతున్న ప్రతి ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో విచారణ చేయించాలని జలమండలి అధికారులు నిర్ణయించారు. తప్పుంటే లైన్‌మెన్, సంబంధిత అధికారులపై వేటు వేయాలనుకుంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో డీజీఎం స్థాయినుంచి కిందిస్థాయిలో అధికారులకు కూడా లైన్‌మెన్ల అక్రమాలతో సంబంధాలున్నాయన్న ఆరోణలు వినిపిస్తున్నాయి. దీనిపైనా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని నగరవాసులు కోరుతున్నారు.

# బైకు పోయిందా.. ఇక అంతే!



హైదరాబాద్: బైకు చోరీల కేసుల పరిష్కారంలో పోలీసుల నిర్లక్ష్యంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాహనం పోయిందని ఎవరైనా ఫిర్యాదు చేసినా స్పందన అంతంతమాత్రంగానే ఉంటోందని బాధితులు వాపోతున్నారు. కొన్ని ఠాణాల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ సీసీ కెమెరాలు తనిఖీ చేయడం.. ఇతర ఇతర ఆధారాలతో దొరకబుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నా మెజార్టీ కేసులను పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా ఎఫ్ఐఆర్ నమోదులో విపరీత జాప్యం జరుగుతోంది. ఎఫ్ఐఆర్ నమోదైతే వాహనం దొరికాక యజమానికి అప్పగించడానికి కోర్టు అనుమతి, చోరీ చేసిన వ్యక్తిని రిమాండు చూపడం వంటి సమస్యలు ఉంటాయనే ఉద్దేశంతో వేచి చూసే ధోరణి ప్రదర్శిస్తున్నారు. మొత్తంగా బాధితులకు చుక్కలు కనిపిస్తున్నాయి. కొందరు వాహన బీమా పాలసీని పొందలేని పరిస్థితి ఎదురవుతోంది.

**కేసు లేకుండా ఎదురుచూపులు**

నగరంలోని మూడు కమిషనరేట్ల పరిధిలో ఏటా 4 వేలకుపైగా వాహనాలు చోరీకి గురవుతున్నాయి. రికవరీ 50– 70 శాతం వరకూ ఉంటోంది. మెజార్టీ కేసుల్లో నిందితులు చిక్కిన తర్వాత కూపీ లాగినప్పుడే వాహనం గుట్టు బయటపడుతోంది. కొన్ని ముఠాలు వ్యవస్థీకృతంగా నడిపిస్తూ చోరీలు చేస్తుంటాయి. కొట్టేసిన బైకులను విడి భాగాలుగా అమ్ముకోవడం, తక్కువగా మార్చడం.. వాహన స్థితి బాగుంటే ఇతర రాష్ట్రాలు లేదా ఇతర జిల్లాల్లోని మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ ధరకు విక్రయిస్తుంటాయి. ఇలాంటి కేసుల్లో రికవరీ చేయడం క్లిష్టంగా మారుతోంది. మిగిలిన కేసుల్లో మాత్రం పరిస్థితి పూర్తిగా వేరు. మైనర్లు, యువత జల్సాలు, చేతి ఖర్చుల కోసం వాహనాలు దొంగిలిస్తారు. బార్లు, రద్దీ ప్రదేశాలు, రోడ్ల వెంట పార్కింగ్ చేసినప్పుడు అదను చూసి కొటేస్తారు. నెంబరు ప్లేటు మార్చి తక్కువ ధరకు విక్రయించడం వంటివి ఉంటాయి. ఈ తరహా కేసుల్లో చోరీ అయిన వాహనాలు రోజుల వ్యవధిలో మరో ఠాణా పరిధిలో పోలీసులకు చిక్కుతుంటాయి. ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో చిక్కిన వాహనాల రిజిస్ట్రేషన్ నెంబర్ల ఆధారంగా పోలీసులు యజమానుల్ని సంప్రదిస్తుంటారు. వాహనం చోరీకి గురైన ప్రాంతం, దాని ఆచూకీ లభ్యమైన ప్రాంత పోలీసులు ఇద్దరూ మాట్లాడుకుని యజమానులకు అప్పగించే ప్రయత్నం చేస్తున్నారు.


**ఇవీ ఉదాహరణలు..!**

నగర శివారులో వారం రోజుల క్రితం బైకు చోరీ జరిగింది. పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదు. వాహనం కొట్టేసిన దొంగ మిడ్జిల్ వరకూ వెళ్లి పెట్రోలు అయిపోగానే అక్కడ వదిలేశాడు. అక్కడి పోలీసులు వాహనం నంబరు ఆధారంగా యజమానిని సంప్రదించారు. చోరీ జరిగిన ఠాణాలో కేసు రిజిస్టర్ అయితేనే.. తదుపరి ప్రక్రియ పూర్తి చేసి వాహనాన్ని అప్పగిస్తామని మిడ్జిల్ పోలీసులు చెప్పారు. ఎఫ్ ఐఆర్ నవోదు జాప్యంతో బాధితుడు ఠాణా చుట్టూ తిరుగుతున్నాడు.

మెట్రో దగ్గర పార్కింగ్ చేసిన వాహనం చోరీ అయ్యింది. పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదు. నాలుగు నెలలు గడుస్తున్నా వాహన ఆచూకీ చిక్కలేదు. ఎఫ్ఐఆర్ నమోదు చేస్తే బీమా క్లెయిమ్ చేస్తానని చెప్పినా స్పందించడం లేదు.

# వేసవిలో చల్లదనం.. చుక్కల్లో వ్యయం

హైదరాబాద్: వేసవిలో విద్యుత్తు వినియోగం పెరగడంతో రూ.వందల్లో రావాల్సిన బిల్లులు రూ.వేలల్లో వస్తున్నాయి. కారణం.. ఏసీల వాడకం భారీగా పెరిగింది. ఇదివరకు ఇంటిలో ఒక ఏసీ వాడితే ఇప్పుడు 2, 3 వాడుతున్నారు. ఆదాయాల వృద్ధితో జీవన ప్రమాణాలు పెరగడంతో ఆ మేరకు ఇళ్లలో విద్యుత్తు వినియోగం పెరిగింది. అదే స్థాయిలో కరెంట్ బిల్లులు వస్తున్నాయి. గ్రేటర్‌లో మూడు విద్యుత్తు జోన్లున్నాయి. ప్రధాన నగరం పరిధిలోకి మెట్రోజోన్ వస్తుంది. ఈ జోన్‌లో బంజారాహిల్స్, హైదరాబాద్ సెంట్రల్, హైదరాబాద్ సౌత్, సికింద్రాబాద్ సర్కిళ్లున్నాయి. ఎల్‌టీకి సంబంధించి గృహ, వాణిజ్య కనెక్షన్లు కలిపి 21.60 లక్షలున్నాయి. మార్చిలో రూ.270 కోట్ల బిల్లులు జారీ అయ్యాయి. ఈ నెలలో చూస్తే ఏకంగా రూ.360 కోట్లకు పెరిగింది. ఏకంగా రూ.90 కోట్లు పెరిగింది. రంగారెడ్డి జోన్ పరిధిలో 4 సర్కిళ్లున్నాయి. ఇక్కడ బిల్లుల్లో పెరుగుదల రూ.70 కోట్లపైనే ఉంది. మేడ్చల్ జోన్‌లో 2 సర్కిళ్లున్నాయి. ఇక్కడ సైతం రూ.30 కోట్లపైనే పెరుగుదల నమోదైంది. మండే ఎండల వల్ల సిటీలో ఒక నెలలో అదనంగా రూ.190 కోట్ల వరకు వినియోగదారుల జేబుకు చిల్లుపడింది.లోటు లేకుండా సరఫరా.. డిమాండ్ ఎంత పెరిగినా.. మార్చిలో కోతలు లేకుండా నిరంతర సరఫరాకు డిస్కం యత్నిస్తోంది. మార్చి 29న రికార్డు స్థాయిలో 81.39



మిలియన్ యూనిట్లు నమోదైతే మెట్రోజోన్, మేడ్చల్ జోన్‌లలో సున్నా బిల్లులు జారీ అయ్యాయి.

పొదుపు చర్యలతో.. అధికంగా బిల్లులు వస్తున్న గృహ వినియోగదారుల జీవనశైలిని గమనిస్తే వృథా కూడా ఎక్కువే ఉంటోందని ఎనర్జీ ఆడిట్ నిపుణులంటున్నారు.


అవసరం లేకపోయినా అన్ని గదుల్లో లైట్లు వెలుగుతుంటాయి. అవసరం లేని వాటిని ఆపేయాలి.

గదిలో ఎవరూ లేకపోయినా ఫ్యాన్ తిరుగుతూనే ఉంటుంది. ఈ తరహా వృథా తగ్గించుకోవాలి. స్మార్ట్ స్విచ్‌ల ఏర్పాటుతో మొబైల్ నుంచే ఆపేయవచ్చు. సెన్సర్లు ఏర్పాటు చేసుకోవచ్చు.

# పై వంతెన పనులు వేగవంతం

వికారాబాద్ : వికారాబాద్ మీదుగా పరిగి, హైదరాబాద్ వెళ్లేందుకు ఒకే పై వంతెన ఉండటంతో నిత్యం వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ సమస్యను పరిష్కరించడానికి రెండు నెలల క్రితం నూతన వంతెన పనులు చేపట్టారు. ప్రస్తుతం వేసవి కావడంతో వేగంగా సాగుతున్నాయి. సకాలంలో పూర్తయితే పట్టణ వాసులకు, వాహనదారులకు రాకపోకలకు అవస్థలు తొలగుతాయి.

అన్నింటికీ కీలకం: ఎప్పుడో 1995–96లో అప్పటి వాహనాల రాకపోకలను అంచనా వేస్తూ వికారాబాద్ ఆరంభంలో పై వంతెన నిర్మించారు. రోజు రోజూకు వాహనాల సంఖ్య అధికం కావడం, జిల్లా కేంద్రం కావడంతోపాటు ఇక్కడే కలెక్టరేట్ కార్యాలయం ఉండటంతో పాటు అన్ని జిల్లా ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. పనుల నిమ్తితం వివిధ ప్రాంతాల ప్రజలు వస్తుంటారు. అంతేకాదు హైదరాబాద్‌నుంచి వికారాబాద్ మీదుగా తాండూరు, ఇతర ప్రాంతాలకు, అలాగే అటు నుంచి హైదరాబాద్‌కు రావాలంటే ఈ వంతెనే కీలకం. వికారాబాద్ నుంచి తాండూరు, సదాశివపేట, నవాబుపేట తదితర ప్రాంతాల నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారు. దీంతో పట్టణ ప్రజలకు నిత్యం ట్రాఫిక్ చిక్కులు తప్పడం లేదు. ఇలాంటి ఇబ్బందులను తొలగించేందుకు గత భారాస ప్రభుత్వం నూతనంగా మరో పై వంతెన నిర్మాణానికి రూ.96 కోట్లను మంజూరు చేసింది.



మాజీ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేస్తే, నిర్మాణ పనులు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమై వేగంగా సాగుతున్నాయి.

సిమెంటు పిల్లర్లు: ప్రస్తుతం ఉన్న పాత వంతెన మట్టి కట్టపై నిర్మించినది. మధ్యలో రైల్వే ట్రాక్ ఉన్న చోట మాత్రమే పిల్లర్లు ఉన్నాయి. దీని పక్కనే చేపట్టిన కొత్త వంతెనకు ఆర్ అండ్ బి అధికారులు సిమెంటు పిల్లర్లు వేస్తున్నారు. దీన్ని అందుబాటులోకి తెచ్చిన తరువాత పాత వంతెనకు కూడా మట్టి తొలగించి సిమెంటు పిల్లర్లు నిర్మిస్తారు. దీంతో రెండు వంతెనలు ప్రజలకు ఉపయోగపడతాయని, తద్వారా ట్రాఫిక్ సమస్య తొలగడంతోపాటు రాకపోకలు ఎంతో వేగంగా సులభంగా మారతాయని అధికారులు వివరిస్తున్నారు.

**త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు**

పై వంతెన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి రోజు పర్యవేక్షిస్తున్నాం. సంబంధిత గుత్తేదారుకు ఇచ్చిన సమయంలోగా పూర్తి అయ్యేలా చూస్తున్నాం. సంవత్సరంలోగా పనులన్నీ పూర్తి చేసి ప్రజలకు వంతెన అందుబాటులోకి తీసుకువస్తాం.శ్రీధర్‌రెడ్డి, అర్ అండ్ బీ డీఈ

# మూసీ చుట్టూ మరిన్ని ఆంక్షలు

హైదరాబాద్: మూసీ నది ఒడ్డున నిర్మాణ అనుమతులపై మరిన్ని ఆంక్షలు అమల్లోకి రాబోతున్నాయి. మూసీ నది అభివృద్ధి సంస్థ(ఎంఆర్‌డీసీఎల్) ఆ దిశగా చర్యలు జరుపుతోంది. ఎంఆర్‌డీసీఎల్ ఉన్నతాధికారులు, హెచ్ఎండీఏ ప్రణాళిక విభాగం వేర్వేరు ప్రతిపాదనలను సిద్ధం చేశాయని, వాటిని పురపాలకశాఖ పరిశీలిస్తోందని యంత్రాంగం తెలిపింది. నదికి మాస్టర్‌ప్లాన్ రూపొందించే సమయానికల్లా.. నిర్మాణ అనుమతుల విషయంలో నిర్ణయం జరగనుందని, ఆమేరకు బృహత్తర ప్రణాళికలో నిబంధనలను చేర్చుతామని వెల్లడించింది. నగరంలో నిర్మాణాల ఎత్తుపై ఎలాంటి పరిమితులు లేవు. సరిపడా స్థలం ఉంటే ఎన్ని అంతస్తులనైనా కట్టుకోవచ్చు. అయితే, మూసీ నదికి ఇరువైపులా ఎత్తును పరిమితం చేయాలని చర్చ జరుగుతోంది. నది అంచు నుంచి 100 మీటర్ల వరకు ఎలాంటి నిర్మాణాలను అనుమతించొద్దనేది అందులో ప్రధానమైనది. ప్రస్తుతం నది అంచు నుంచి 50 మీటర్ల వరకు బఫర్ జోన్ ఉంది. అందులో నిర్మాణ అనుమతులను ఇవ్వకూడదనేది నిబంధన. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మూసీ నది అభివృద్ధికి చర్యలను ముమ్మరం చేయడంతో బఫర్‌జోన్‌లో ఒక్క అనుమతి కూడా మంజూరు కావొద్దని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ నిర్ణయించారు. అదే సమయంలో ఎంఆర్‌డీసీఎల్ మరో



2 ప్రతిపాదనలను తెరపైకి తెచ్చింది. మూసీ నుంచి 100 మీటర్ల వరకు అనుమతులను ఇవ్వొద్దని, అక్కడి నుంచి 200 మీటర్ల పరిధిలో భవనాల ఎత్తును పరిమితం చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు.

**అమలుకు అనేక సవాళ్లు..**

జంట జలాశయాల నుంచి మొదలయ్యే మూసీ నదిని తూర్పున ఓఆర్‌ఆర్ వరకు అభివృద్ధి చేయాలన్నది ప్రభుత్వ ప్రణాళిక. నదీ పరీవాహక ప్రాంతాన్ని పర్యాటకం, వాణిజ్యపరంగా అభివృద్ధి చేసి, తూర్పు, పశ్చిమాలను కలుపుతూ విశాలమైన రోడ్డు మార్గాలను నిర్మించాలని, నది పొడవునా పార్కులు, పచ్చదనం, వాణిజ్య సముదాయాలను నిర్మిస్తామని ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఆ దిశగా ఎంఆర్‌డీసీఎల్ చర్యలు ప్రారంభించింది. నిర్మాణ అనుమతుల విషయంలో పలు ప్రతిపాదనలను సిద్ధం చేస్తోంది. అయితే, బఫర్‌జోన్‌ను ప్రమాణికంగా తీసుకుంటో నదిలో ఇప్పటికే 10 వేల నిర్మాణాలున్నాయి. వాటిని తొలగించి మౌలిక సౌకర్యాలను విస్తరించడంలో అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. 200 మీటర్ల వరకు నిర్మాణ అనుమతుల విషయంలో పరిమితులను విధిస్తే అభివృద్ధి ప్రాజెక్టుపై స్థానికుల్లో ఆందోళన వ్యక్తమయ్యే అవకాశాలున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

# కాంగ్రెస్ పార్టీ 100 రోజుల వైఫల్యాలపై పోస్టు కార్డు ఉద్యమం
## సీఎంకు లేఖలు రాసిన సిద్దిపేట రైతులు



సిద్దిపేట : కాంగ్రెస్ పార్టీ 100 రోజుల వైఫల్యాలపై రైతులు పోస్టు కార్డు ఉద్యమం ప్రారంభించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సిద్దిపేట రైతులు లేఖలు రాశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజాస్వామ్య పంథాలో సిద్దిపేట రైతులు నిరసన తెలుపుతున్నారు. ఇచ్చిన మాట ప్రకారం రైతు హామీలు అమలు చేయాలి. లేని పక్షం లో ఎంపీ ఎన్నికల్లో ఓటు ద్వారా గుణపాఠం చెప్తాం అని రైతులు హెచ్చరించారు.

**పోస్టుకార్డు ఉద్యమానికి బీఆర్ఎస్ మద్దతు :** రైతుల పోస్టు కార్డు ఉద్యమానికి బీఆర్ఎస్ నాయకులు మద్దతు పలికారు. సిద్దిపేట నియోజకవర్గంలోని సిద్దిపేట పత్తి మార్కెట్ యార్డ్‌లో, సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్‌లో, చిన్న కోడూర్ మండలం మార్కెట్ యార్డ్‌లో రైతులు స్వచ్ఛందంగా సీఎం రేవంత్ రెడ్డికి పోస్ట్ కార్డు ద్వారా ఉత్తరాలు రాశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చినటువంటి రైతు హామీలు అమలు చేయకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పోస్ట్ కార్డు ద్వారా తమ ఆవేదనను సీఎం రేవంత్‌కు తెలిపారు.

**రైతులకు ఇచ్చిన హామీలు**

-వరి ధాన్యానికి రూ. 500 బోనస్
-రైతు భరోసా రూ. 10,000లకి బదులు రూ. 15000
-రైతు కూలీలకు రూ. 12000..
-రైతు రుణమాఫీ రెండు లక్షల రూపాయలు..
-రైతు బీమా.. -వర్షాలు రాక ఎండిపోయిన పంటలకు నష్టపరిహారంగా రూ. 25000..

ఈ హామీలను వెంటనే అమలు చేసి రైతు సోదరులను ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పోస్టు కార్డులు రాసి పంపారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే ఎంపీ ఎన్నికల్లో ఓటుతో గుణపాఠం చెపుతాం అని హెచ్చరించారు.

# కవితకు మళ్లీ షాక్..



## ఎమ్మెల్సీ కవితకు బిగ్ షాక్.. మళ్లీ కస్టడీ పొడిగింపు

ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవితకు మరో షాక్ తగిలింది. ఈ నెల 23 వరకు కవితకు జ్యుడీషియల్ కస్టడీ విధించింది రౌస్ అవెన్యూ కోర్టు. లిక్కర్ స్కామ్ కేసులో కవితను మూడు రోజులు సీబీఐ కస్టడీకి అప్పగించారు. ఈ మూడు రోజుల కస్టడీ నేటితో ముగియడంతో.. ఆమెను రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరిచారు. ఈ సందర్భంగా సీబీఐ తరఫు న్యాయవాదులు, కవిత తరఫున న్యాయవాదుల మధ్య వాదోపవాదనలు జరిగాయి. 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి ఇవ్వాలని సీబీఐ కోరింది.

సాక్ష్యాలను కవిత ముందు పెట్టి విచారించామని.. విచారణకు ఆమె సహకరించలేదని సీబీఐ ఆరోపించింది. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. కవితను 9 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి అప్పగించింది. దీని ప్రకారం.. కవిత ఏప్రిల్ 23వ తేదీ వరకు జ్యుడీషియల్ కస్టడీలో ఉండనున్నారు.

**జై తెలంగాణ నినాదంతో..** కాగా, ఎమ్మెల్సీ కవితను రౌస్ అవెన్యూ కోర్టులో హాజరు పరిచింది సీబీఐ. కోర్టులోకి వెళ్లే ముందు కవిత జై తెలంగాణ నినాదం చేశారు. వాదనల అనంతరం కోర్టు నుంచి బయటకు వచ్చిన ఆమె.. మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా తీవ్ర ఆరోపణలు చేశారు. ఇది సీబీఐ కస్టడీ కాదని.. బీజేపీ కస్టడీ అని ఆరోపించారు. బయట బీజేపీ వాళ్లు అడగిందే.. లోపల సీబీఐ అడుగుతోందన్నారు. రెండు నెలల నుంచి అడిగిన ప్రశ్నలే మళ్లీ మళ్లీ అడుగుతున్నారని, కొత్తగా ఏమీ లేదన్నారు కవిత. కాగా, కవిత ఏప్రిల్ 23వ తేదీ వరకు తీహార్ జైల్లో ఉండనున్నారు.

# చిత్రపటాలు పంచడమేనా.. బీజేపీ చేసే పని..? నిప్పులు చెరిగిన హరీశ్‌రావు



కొడంగల్ : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పై సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బీజేపోళ్లకు చెప్పుకోవడానికి పథకాలు లేవు కనుక చిత్రపటాలు, క్యాలెండర్లు, బ్యాగులు చీరలు పంచుతున్నారు. ఇదేనా బీజేపీ చేసే పని..? అని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. కొడంగల్‌లో ఏర్పాటు చేసిన మహబూబ్‌నగర్ పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశంలో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. గెలిచినా.. ఓడినా ప్రజల మధ్య ఉండే పార్టీ బీఆర్ఎస్ పార్టీ. ఓడిపోతే ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు పోరాడుతున్నాం. ప్రజల మధ్యలోనే ఉంటాం. ప్రజల కోసం పని చేసే పార్టీ బీఆర్ఎస్. ఈ ఎన్నికల్లో ఆలోచించాలి. కాంగ్రెస్, బీజేపీ ఓట్లు వేయమని అడుగుతున్నారు. పదేండ్ల బీజేపీ, పదేండ్ల బీఆర్ఎస్ పాలన చూశారు. బీఆర్ఎస్ ఏం చేసింది అని అడిగితే 100 స్కీమ్‌లు చెప్తారు. రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్, ఆసరా పెన్షన్లు, కల్యాణలక్ష్మి.. ఇలా వంద పథకాల పేర్లు మీరు చెప్పగలుగుతారు అని హరీశ్‌రావు తెలిపారు.

**మరి బీజేపీ ఏం చేసిందో చెప్పగలుగుతారా..? :** మరి బీజేపీ ఏం చేసిందో చెప్పగలుగుతారా..? ప్రచారానికి గ్రామాల్లోకి వచ్చే బీజేపీ నాయకులకు నిలదీయండి. దళితులకు, గిరిజనులకు, రైతులకు, పేదలకు మంచి పని చేయలేదు. కొన్ని పనులైతే చేసింది.. పెట్రోల్ డీజిల్ ధర పెంచింది. అదే విధంగా గ్యాస్ సిలిండర్ ధర రూ. 1000 పెంచారు. ఎన్నికలు వచ్చాయంటే వంద దించారు. మనం ఏమన్న అమాయకులమా..? చెవుల్లో ఏమన్న పువ్వులు పెట్టుకున్నామా..? నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పెరిగిన ధరలతో పేదల నడ్డి విరిచింది ఈ బీజేపీ ప్రభుత్వం. పేదలు బతకడం కష్టమైంది. ఆకలి నిరుద్యోగం, పేదరికం పెరిగింది. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. ఈ పదేండ్లలో 20 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండే. నిరుద్యోగులను బీజేపీ మోసం చేసింది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

**బీజేపీ నాయకులు మాటలతో మాయ చేయాలని చూస్తున్నారు..** బీజేపీ నాయకులకు చెప్పుకోవడానికి పథకాలు లేవు కనుక చిత్రపటాలు, క్యాలెండర్లు, బ్యాగులు, చీరలు పంచుతున్నారు. ఇదేనా బీజేపీ చేసే పని..? దేశ వ్యాప్తంగా 157 మెడికల్ కాలేజీలు ఇస్తే.. తెలంగాణకు ఒక్క మెడికల్ కాలేజీ ఇవ్వలేదు. దేశంలోని ఆయా రాష్ట్రాలకు 157 నర్సింగ్ కాలేజీలు ఇస్తే తెలంగాణకు మొండి చేయి చూపించారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇవ్వకుండా మోసం చేసింది. గత ఎంపీ ఎన్నికల్లో మోదీ మహబూబ్‌నగర్ వచ్చి పాలమూరు - రంగారెడ్డి పూర్తి చేస్తామని చెప్పి కనీసం అనుమతి ఇవ్వలేదు. ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. బీజేపీ నాయకులు మాటలతో మాయ చేయాలని చూస్తున్నారు. జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు హరీశ్‌రావు సూచించారు.





# నిజామాబాద్‌లో పసుపుబోర్డుకు కాంగ్రెస్ సిద్ధం...

నిజామాబాద్, ఏప్రిల్ 15: నిజామాబాద్‌లో పసుపు బోర్డుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందని నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం డిచ్‌పల్లి మండలం ధర్మారం (బి) గ్రామంలోని రిటైర్డ్ ప్రొఫెసర్ విద్యాసాగర్ నివాసంలో అల్పాహారం చేసిన జీవన్ రెడ్డి అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్‌పై విరుచుకుపడ్డారు. ఐదు రోజుల్లో పసుపు బోర్డు తెస్తానని చెప్పిన అర్వింద్ ఐదు సంవత్సరాలు గడిచినా బోర్డ్ తేలేదని విమర్శించారు. రుణమాఫీ, పసుపు బోర్డ్, చెక్కర కర్మాగారం ఏర్పాటుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందని అన్నారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ నిజామాబాద్ రూరల్‌ను అభివృద్ధి చేయలేదని వ్యాఖ్యలు చేశారు. నిజామాబాద్ జిల్లాలో తెలంగాణ యూనివర్సిటీ, మెడికల్ కళాశాలను కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిందని తెలిపారు. బాజిరెడ్డి గోవర్ధన్ ఆర్టీసీ చైర్మన్‌గా ఉండి మహిళలకు ఉచిత ప్రయాణం ఎందుకు ఆలోచన చేయలేదని ప్రశ్నించారు. ఎంపీగా గెలిచిన వెంటనే మహిళా డిగ్రీ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. బీడీ మహిళ కార్మికులకు ఎలాంటి షరతులు లేకుండా ఫించన్లు అందిస్తామన్నారు. సారగపూర్ సహకార సంఘం చెక్కర పరిశ్రమ ప్రారంభిస్తామని జీవన్ రెడ్డి హామీ ఇచ్చారు.

# కల్యాణోత్సవం లైవ్‌కి అనుమతివ్వండి.. ఈసీకి మంత్రి కొండా సురేఖ లేఖ

హైదరాబాద్: భద్రాద్రి సీతారాముల కల్యాణం ప్రత్యక్ష ప్రసారానికి ఎన్నికల సంఘం అనుమతి నిరాకరించిన నేపథ్యంలో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి మూడోసారి లేఖ రాశారు. సీతారాముల కల్యాణం ప్రత్యక్ష ప్రసారానికి ఎన్నికల కోడ్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. 40 ఏళ్లుగా కల్యాణ మహోత్సవం ప్రత్యక్షప్రసారం జరుగుతోందని చెబుతూ.. ఆలయ విశిష్టత, సంప్రదాయాలను లేఖలో వివరించారు. ఈ నెల 17న సీతారాముల కల్యాణం, 18న మహాపట్టాభిషేకం వైభవోపేతంగా నిర్వహించనున్నారు.





# ఎండిన పంటలను చూసేది లేదు.. రైతులకు భరోసా ఇచ్చేది లేదు: మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



హైదరాబాద్: సాగు నీరులేక పంటలు ఎండిపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. హస్తం పార్టీ నేతలు పాలనను గాలికి వదిలేశారని విమర్శించారు. కేసీఆర్‌ను బద్నాం చేసేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇచ్చిన హామీ మేరకు పంటకు బోనస్ ఇస్తారో లేదో చెప్పాలన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. జలాశయాల్లో నీటి లభ్యత ఉన్నా ప్రభుత్వ నిర్వహణ లోపం వల్ల ప్రజలకు ఇబ్బందులు కల్పిస్తున్నారు. ఒక్క మార్చి నెలలోనే అధికారిక లెక్కల ప్రకారం 1 లక్ష 45 వేల ట్యాంకర్లను వాడారని చెప్పారు. ఇవి కాక ఎన్ని రెట్లు ప్రైవేట్ ట్యాంకర్లు నీళ్ల వ్యాపారం చేశారో కళ్లారా చూస్తున్నామని విమర్శించారు. యాసంగి పంటలు వస్తున్నా వరి ధాన్యాన్ని ఎక్కడ నిల్వ చేయాలో ఇప్పటికీ స్పష్టలేదన్నారు. యాసంగి పంటను కనీస మద్దతు ధరకు కొనాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పాలనలో 65 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యానికి పెంచామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇతర పార్టీ నుంచి చేరికలపై దృష్టి పెట్టిందన్నారు. కేసీఆర్ హయాంలో సాగు, తాగునీటికి కొరత రాలేదని తెలిపారు. రైతుల ఆత్మహత్యల వివరాలు పంపినా ప్రభుత్వం నుంచి స్పందన కరువైందన్నారు. ఆత్మహత్య చేసకున్న రైతు కుటుంబాలను పరామర్శించడం లేదని చెప్పారు. ఎండిన పంటను చూసేది లేదు.. రైతులకు భరోసా ఇచ్చేది లేదన్నారు. పాలనపై, ప్రజలపై మంత్రులకు ఎలాంటి శ్రద్ధ లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్ మీద కోపంతో మహనీయుడు అంబేద్కర్‌ను కాంగ్రెస్ పార్టీ అవమానించిందని ఆరోపించారు. కేసీఆర్ కట్టించాడన్న అక్కసుతో ప్రజలు, ప్రజా సంఘాలు అంబేద్కర్ విగ్రహం దగ్గరికి వెళ్లకుండా తాళం వేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మరి అప్పుడు కేసీఆర్ కట్టించిన సెక్రటేరియట్‌లో కూర్చోకండని వెల్లడించారు. కేసీఆర్ కట్టించిన మిషన్ భగీరథ నుంచి నీళ్లు ఇవ్వకుండా మీరు సొంత కార్యక్రమంతో నీళ్లు ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి అంబేద్కర్ అంటే మొదటి నుంచి గిట్టదన్నారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194

# తాగునీటి సమస్య తీర్చాలని ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి జల దీక్ష

జోగులాంబ గద్వాల : గద్వాల ప్రజల తాగునీటి సమస్య తీర్చాలని డిమాండ్ చేస్తూ గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి సోమవారం జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద జల దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సాగు, తాగు నీళ్లు లేక ప్రజలు అల్లాడిపోతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కష్టాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. గద్వాల ప్రజల తాగు నీటి సమస్యను పరిష్కరించేందుకు కర్ణాటక నుంచి 5 టీఎంసీల నీటిని విడుదల చేసేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దీక్ష చేపట్టారు. కాగా, సాయంత్రం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు జల దీక్ష కార్యక్రమంలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతారని బీఆర్ఎస్ శ్రేణులు తెలిపాయి.



# కేజ్రీవాల్‌కు దక్కని ఊరట.. సుప్రీంలో విచారణ వాయిదా



దిల్లీ: మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీం కోర్టులో ఊరట లభించలేదు. అరెస్టును సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. దీనిపై ఈడీకి నోటీసులు జారీ చేసిన న్యాయస్థానం.. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. మనీలాండరింగ్ కేసులో కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేయడాన్ని ఇటీవల దిల్లీ హైకోర్టు సమర్థించింది. దీన్ని సవాల్ చేస్తూ దిల్లీ సీఎం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను స్వీకరించిన జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం.. ఈడీకి నోటీసులు జారీ చేసింది. దీనిపై ఏప్రిల్ 24లోగా తమ స్పందన తెలియజేయాలని దర్యాప్తు సంస్థను ఆదేశించింది. దీనిపై ఏప్రిల్ 29 తర్వాత విచారణ నిర్వహిస్తామని వెల్లడించింది. 2021-22 నాటి దిల్లీ మద్యం విధానంలో జరిగిన అవకతవకలకు సంబంధించిన కేసులో మార్చి 21న ఈడీ అధికారులు కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఆయనకు 15 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధించడంతో ప్రస్తుతం తిహాడ్ జైల్లో ఉన్నారు. ఆ కస్టడీ నేటితో ముగియనుండటంతో సీఎంను కోర్టులో హాజరుపర్చనున్నారు. ఒకవేళ న్యాయస్థానం మరోసారి కస్టడీ పొడిగిస్తే ఆయన మరికొన్ని రోజుల పాటు జైల్లో ఉండాల్సి వస్తుంది.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660